## 'ఆమె నాగదిలోవున్నతరువాత కామం నన్ను లోబఱుచుకొంది.'

# 'ఎందుకొచ్చాను ఈఊరు?'

'ఒకవిధమైన ఉదుటు నన్ను ప్రతిఏడూ ఆవూరు తీసికెడుతోంది.'

చిన్నకథ :

Maupassant వ్రాసిన పరాసుకథకు స్వేచ్ఛానుకరణము.

రచయిత:

కావలి శ్రీరామమూర్తి, బి. యే.

చాలాకాలంనుంచి నాగుండెల్లో రాయికట్టుకుపోయింది నేను చెప్పబోయేది. ఇది నన్ను మంటలో కాల్చివేసింది, అవమానంచే అణచివేసింది. నా సందేహం, నా ఆశంక తీరని సమస్యలై పోయాయి. ఇవి ఎప్పటికైనా తీరుతాయని ధైర్యంకాని వీనికి అంతూపంతూ కాని కనిపించడంలేదు.'

నాకు ఇరువైఐదుఏళ్ళప్పుడు, ఒక స్నేహితుడితో యాత్రకు వెళ్లేను.

పది, పదిహేనురోజులు యిష్టంవచ్చినట్లు తిరిగినతర్వాత ఓపల్లెచేరేం. అక్కడ నాస్నేహితుడికి జ్వరంవచ్చింది. వెంటనే పక్కనున్న 'పా—' అనేపట్నం వెళ్లేం. మా అదృష్టవశాత్తు అక్కడ ఓహోటలు వుంది. అక్కడ నాస్నేహితుడికి జబ్బు ఎక్కువయింది.

నువ్వు ఎప్పుడైనా 'పా—' వెళ్లేవా? లేదూ! అది ఓగమ్మత్తువూరు. పల్లెకాదు పట్నంకాదు. మధ్యగకం. ఆజిల్లా లక్షణాలన్నీ ఆవూళ్ళో ప్రతిఫలిస్తాయి. అక్కడ నవనాగరికత చొచ్చుకొనే మార్గంలేదు. అప్పటికి యిప్పటికీ ఆవూరులో ఏమార్పూ కనిపించదు.

ఇప్పటికీ అని ఎందుకంటున్నానంటే నాపాపఫలం కోసం ప్రతిఏడూ నేను అక్కడికి వెళ్తున్నాను.

రైలు దిగగానే ఓపాడుపడిన కోట నిన్ను ఆహ్వానిస్తుంది. ఓకాలువ ఆకోటను చుట్టి ప్రయాణం సాగిస్తోంది. ఆ సన్నని వీధులకి యుగయుగాలనాటి పూరికొంపలే అలంకారం. మోకాళ్ళు దిగని బట్టలూ, బుజాలుదిగని షర్టులూ మొగాళ్ళదుస్తులు. ఇంక యువతులా! మంచి బలంగా వుంటారు. అంత అందగత్తెలు కారుకాని, నాగరికుల్లా శల్యాల్లా కాకుండా జీవంతో పొంగుతూ వుంటారు. కప్పీకప్పనిబట్ట వక్షాలని మరుగుపరుస్తోంది. చెవులకు రెండు యిత్తడిచక్రాలు వాళ్ళ లోలక్కులు.

హోటలుదాసీ 'నళిని'కి పద్ధనిమిది ఏళ్ళకంటె ఎక్కువవుండవు. ఆమె అంత పొడుగవడానికి వీలులేదు. ఆలేత నీలాల్లాంటి కళ్ళకు నల్లని కంటిపాపలు వింతసోయగాన్ని ఇస్తున్నాయి. ఆమె దంతాల్లాంటి పళ్ళవరుసలు నవ్వినప్పుడల్లా మంచిముత్యాలు వెదజల్లుతున్నాయి. ఆమెకు మనభాష కొంచమైనా రాదు. ఆమె తనదేశంవాళ్ళలాగే 'మరాటీ' తప్ప యింకేమీ మాట్లాడేది కాదు.

నాస్నేహితుడికి జ్వరం తగ్గలేదు. డాక్టరు ఆవూరు వదలివెళ్ళడానికి వీల్లేదన్నాడు. అతని పరుపుపక్కనే గడపవలసివచ్చింది కాలమంతా. నళిని, ఒకప్పుడు భోజనం, ఒకప్పుడు ఫలహారం, ఇంకో అప్పుడు డ్రింకులు పట్టుకొచ్చేది గదిలోకి. ఆవచ్చినప్పుడల్లా వేళాకోళం చేసేవాణ్ణి. హాస్యాలాడేవాణ్ణి. ఆమె నవ్వుతూవున్నట్లు కనిపించేది. ఒకళ్ళభాష ఇంకోళ్ళకు తెలియకపోవడంవల్ల మేము ఎప్పుడూ మాటాడుకోలేదు.

ఒకనాడు రాత్రి చాలాసేపటివరకు స్నేహితునిగదిలోవుండి, నాగదికి వెళ్ళిపోతున్నాను. అక్కడ నళిని తన గదిలోనికి పోతూ కనిపించింది. ఆమెగది నాగదికి ఎదురుగానే. ఆలోచనలేకుండా, అకస్మాత్తుగా సగం హాస్యంకోసం, సగం అల్లరిచేద్దామని, ఆమె చెయ్యిపట్టుకొని నాగదిలోకిలాగి గడియవేసాను. భయంతోనూ, కోపంతోనూ, అవమానంతోనూ, స్తబ్ధు అయిపోయింది నళిని. వెర్రిచూపులతో నాకేసి చూసింది. కేకలేస్తే తనగౌరవానికి, మర్యాదకి భంగం కలగడమే కాకుండా, ఉద్యోగం పోవడం తప్పదు.

హాస్యానికే యిది చేసాను మొదట. ఆమె నాగదిలో వున్నతరువాత కామం నన్ను లోబర్చుకొంది. నేను పశుప్రాయుణ్ణయిపోయాను. కొంతసేపు చప్పుడు కాకుండా లొంగతీసుకోడానికి ప్రయత్నించాను. ఇద్దరమూ కుస్తీపట్టీనంత పని చేశాము. నిజంగా నళిని చాలాసేపు ధైర్యంగా నిలిచి పోరాడింది. ఒకసారి పెద్దబల్లపై పడిపోయాము. కుర్చీ బోర్లపడింది. పెద్ద చప్పుడయింది. ఎవరైనా లేస్తారేమో అని భయపడి కొంతసేపు నేను వూరుకొన్నాను. మళ్ళీ ఆమెను లొంగతీయడం మొదలెట్టాను. ఆమె తన్ను కాపాడుకోడానికి చాలాప్రయత్నించింది. ఆఖరికి అలసిపోయి నేలమీద పడిపోయింది. ఇంక అడ్డుపెట్టలేదు,

ఆమెను వదలివేసినప్పుడు తారాజువ్వలాగ పరుగెత్తిపోయింది.

అక్కడవున్న మిగతా కొద్దిరోజులూ నేను నళినిని తరచు చూడలేదు. నన్ను దగ్గిరికి చేరనివ్వకుండా దూరంగానే మెలగేది. మరునాడు, ప్రయాణానికి నిశ్చయించాము. ఆరోజు అర్ధరాత్రిని నాగదిలోకి వచ్చింది నళిని. తనబాహువుల్లో నన్ను బంధించి తనహృదయానికి నన్ను అద్దుకుంది. ఏడుస్తూ, విచారిస్తూ, ఓదారుస్తూ, తను నన్ను ప్రేమించినట్లు అనేక చిహ్నాలతో చూపింది. మూగసంజ్ఞలతో నాకేదో బోధించింది.

ఓవారంరోజులయాక నేను నళిని మాట మేము గడిపిన రాత్రులుకూడా మరచిపోయాను.

మళ్లీ ముప్ఫయ్యేళ్లదాకా ఆతలపే లేదు నాకు. నేనెప్పుడూ, ఈ ముప్ఫయి ఏళ్లలోనూ 'పా—' అనేవూరు వెళ్లలేదు. నేను రాస్తున్ననవలలో కొన్ని ఘట్టాలకోసం, ఆజిల్లాఅంతా తిరగవలసివచ్చింది. అప్పుడు 'పా—' వెళ్లేను. ఏమీమార్పులేదు ఆపట్నానికి. ఆపాడుపడినకోట, ఆకొలువ, ఆహోటలు అన్నీ మునపటివే. మరాటీయువతుల ఆచారవ్యవహారాల్లోకూడా ఏమీ భేదంలేదు.

సాయింకాలం అయింది. హోటలు యజమానితో మాటామంతీ ఆడుతూ కూర్చున్నాను.

'ఇదివరకు ఈహోటలు ప్రొప్రయిటరు, నీకు తెలుసా? నేను యిక్కడ పదిరోజులున్నాను... ముప్ఫయియేళ్ళ మాట. చాలాకాలమయింది.' అన్నాను.

'వాళ్లు నాతలిదండ్రులండి.' అన్నాడు.

అప్పుడు అతనితో చెప్పాను. నేను అక్కడికి రావడం. స్నేహితుడివంట్లో అస్వస్థతవల్ల చాలాకాలంవుండడం. అంతలో నామాటకు అడ్డువచ్చి

'నాకు బాగా జ్ఞాపకముందండి. అప్పుడు నాకు పదిహేను లేక పదహారేళ్లుంటాయి. మీస్నేహితుడిగది అదిగో. అది నాగది యిప్పుడు. మీగది అదిగో.'

అప్పుడు జ్ఞాపకమొచ్చింది నాకు నళినిమాట.

'ఇక్కడ ఓపద్దెనిమిదేళ్ళ పిల్లవుండేది, జ్ఞాపకముందా?' అని అడిగాను.

'అవును. ఆమె ప్రసవసమయంలో చనిపోయింది. దొడ్లో పనిచేస్తున్న ఓ సన్నని కుంటివాణ్ణి చూపించి 'వాడే దాని కొడుకు' అని చెప్పాడు.

నాకు నవ్వొచ్చింది.

'తల్లిఅంత అందంగాలేడు వీడు. వాడితండ్రిపోలిక కాబోలు' అన్నా.

'అయివుండవచ్చు. కాని అతనితండ్రి ఎవరో ఎవరికీ తెలియదు. ఆమె చనిపోయేటప్పుడైనా చెప్పలేదు తండ్రిపేరు. ఆమెకు అసలు ప్రియుడున్నాడనే తెలియదు ఎవరికీ. ఆమె గర్భంధరించిందంటే అందరికీ చాలా ఆశ్చర్యంవేసింది. ఎవరూ నమ్మలేదు చివరదాకా.' అన్నాడుఅతను.

నాహృదయంలో ఏదో తీరని వ్యధకి ఉపోద్ఘాతంలాగ. ఒకవిధమైన చెప్పలేని సంచలనం కలిగింది. ఆదొడ్లో పనిచేస్తున్నవాడికేసి చూసాను. ఆవులకి నీళ్లు తోడుతున్నాడు. తనపొట్టికాలు ఈడ్చుకుంటూ బుజాన్ని బరువైనకావిడి మోసుకుపోతున్నాడు. మాసి తూంట్లుపడిన బట్టలు. పొడుగైన చింపిరిజుట్టు చెవులు దాటి బుజాలమీద పోగుపడుతోంది.

'వాడి అవసరం మాకేమీలేదండి, దయదలచి వాణ్ణి అట్టేపెట్టేము. ఇతర కుర్రాళ్ళలా పోషణపొందితే మంచివాడు అవును. మనమేంచేస్తాం! ఎవడి ఖర్మానికి ఎవడుకర్తలు? ఏమవుతుందండి. తల్లిలేదు. తండ్రిలేదు. డబ్బులేదు.' అన్నాడు యజమాని.

నేను జవాబుచెప్పలేను. గదిలోకి పోయి పడుకున్నాను. రాత్రంతా నిద్రపట్టలేదు. ఆకుంటివాణ్ణిగురించే ఆలోచనలు.

'వాడు నాకొడుకేమో? నేను ఆ పశువుతండ్రినా? అతని తల్లిని చంపినవాణ్ణి నేనే!' వాడితో మాట్లాడి అతను పుట్టినరోజు కనుక్కుందామని నిశ్చయించాను. ఇంతకన్న మంచివుపాయంలేదు, నాసందేహం తీరడానికి. ఉదయాన్నే, ఆకురూపికి కబురంపించాను. వాడితల్లిలాగే వాడికీ మనభాషరాదు. అంతేకాదు వాడికేమీ అర్థంకాదు. వొట్టి కుంకలా కనిపించాడు. కాని అతనిముఖం మీద మాత్రం తల్లి చిరునవ్వు తాండవమాడుతోంది. ఆకళ్లు, ఆ పెదవులు నళినివే. ఆసమయానికే హోటలు యజమాని వచ్చి మునిసిపల్ ఆఫీసులో వాడిపుట్టుకదినం కనుక్కొనివచ్చాడు. నేను 'పా—' ముప్ఫయిఏళ్ళకింద విడిచిపెట్టిన ఎనిమిదినెలల ఇరువైయారు రోజులకు వాడు దిగాడు యీలోకంలో. నాకు బాగా స్ఫురణలోవుంది నేను ఆవూరు విడిచినరోజు.

ఇది వినేటప్పటికి నాగుండెలలో దడపుట్టింది. నాశరీరం పులకరించింది. గొంతుకలోనే వుండిపోయాయి నేను అనుకున్న మాటలన్నీ, తెల్లపోయి చూసాను నళినికొడుకుకేసి. నాతీక్షణవీక్షణాలలోపడి గజిబిజియై పారిపోయాడు అతను.

ఆదినమంతా కాలవగట్లమ్మట తిరిగాను విచారహృదయంతో. నా ఆలోచనలకు ఓ తెగూ తెంపూ కనిపించలేదు. గంటలకొద్దీ, ఓనిర్ధారణకు వద్దామని ప్రయత్నించాను. నేను వాడి తండ్రిని అవునాకాదా? ఛీ! ఛీ! ఎంతమాత్రం కాదు. నేనేమిటి ఆకుంటివాడి తండ్రినేమిటి అనుకునేవాణ్ని. [illegible]ను దేహాంతరంగాలలో దొర్లిపో[illegible]ని. ఆఖరికి వాడు నాకొడుకుఅని భయంకరమైన నిర్ధారణకు వచ్చేవాణ్ని.

భోజనం సహించేదికాదు. ఎవరైనా నన్ను, నాస్థితి చూస్తే నాపని అయినట్టే. అయ్యో! దైవమా! ఎందుకొచ్చాను ఈ వూరు? ఏంవిచారంలేని మనిషిలావుండాలని ప్రయత్నించా. నలుగురూ వుంటే

నాగదిలోకి వెళ్ళిపోయేవాణ్ణి. ఆరాత్రి కలలు కలలుగా గడిపేను. భయంకరమైన కలలు నాకు విషాదం కలిగించాయి. ఆకురూపి నాముఖంమీద నవ్వుతూ 'నాన్నా' అని పిలిచేడు. ఇంతట్లో, కుక్కఅయి నాపిక్కపట్టుకొని కరిచాడు. తప్పించుకుందామని ఎంత ప్రయత్నించినా వదలకుండా వెంటేపరుగెత్తి నన్ను తెగతిట్టాడు. వాడితండ్రిని నేను అవునో కాదో నిశ్చయించడానికి ఓసభ నియిమింపబడినదట. అందులోకి వాడు వచ్చాడు. ఒక డన్నాడు. 'అబ్బే సందేహంలేదు. వాళ్ళపోలిక చూడండి.' అప్పుడు నిజంగా ఆనీచుడికి, నాకు పోలిక కనిపించింది. ఇంతలో మెలుకువ వచ్చింది.

కాని, పోలికవున్నదన్నమాట మాత్రం మనసులో వుండిపోయింది. వాడ్ని బాగాచూసి నాతో పోల్చుకో నిశ్చయించాను., అది ఆదివారం. కొలువగట్టున వాడు కనిపించాడు. వాడికి ఓరూపాయి ధర్మంచేసి మాటమంతీ ఆడుతూ జాగ్రత్తగా పరిశీలించాను. ఆడబ్బుపుచ్చుకొని వెకిలినవ్వునవ్వుతూ నుంచున్నాడు. కొంతసేపటికి నాతీవ్రపరిశీలనచూసి సిగ్గుపడి, క్షమించమన్నట్టు వాడి భావలో పలికి నడచిపోయాడు.

ఆరోజుకూడా వేదనతోనే గడిచింది. సాయింకాలం, యజమానినిపిలిచి, నిగూఢంగాను, 'డిప్లమేటిక్'గాను నాకు ఆ అనాథపై జాలికలిగిందని, వాడికేదైనా సాయంచేయాలని వుందని చెప్పాను.

'మీరు వాడికోసం ఏమీ విచారించకండి. మీదయకు పాత్రుడవడానికి తగినవాడుకాడు. మీకు కష్టం కలుగుతుంది చివరికి. ఇక్కడ ఆవులకి నీళ్లుపెడుతూ మాయింట్లో పనిచేస్తూ వుంటాడు, వాడికి కావలసిన తిండీ బట్టా నేను యిస్తాను. మీకు పనికిరాని బట్టలుంటే యివ్వండి వాడికి.' అన్నాడు అతను.

ఇంక ఎక్కువగా నేను చెప్పలేదు. ఆలోచిస్తానని చెప్పాను. సాయంకాలము, నళినికొడుకు చెడత్రాగి వచ్చి నానా అల్లరీ చేసాడు. ఇంటిపెంకు లెగిరేటట్టు కేకలేసాడు. బల్లలు చితుకకొట్టాడు. చివరికి వర్షంలో పడుకున్నాడుట. నేనిచ్చిన రూపాయి యింతపని చేసింది.

యజమాని వాడికి యింక డబ్బుయివ్వవద్దని బతిమాలుకొన్నాడు. 'మీకు వాడ్ని చంపేయాలనివుంటే డబ్బుయివ్వండి.' అని ముగించాడు అతను. వాడికి డబ్బుకి వేరే ఉపయోగం కనిపించలేదు, సారాయికొనడానికి తప్ప.

గంటలకొద్దీ నాగదిలో పుస్తకం చేతిలోపట్టుకొని కూచునేవాణ్ణి చదువుతున్నట్టు నటిస్తూ, కిటికీలోంచి పనిచేస్తున్న ఆకుంటివాణ్ణిచూస్తూ. నాలక్షణాలు వాడిలో ఏమైనా వున్నాయా అని పరిశీలించేవాణ్ణి. ఆ నుదుటిమీద ముడుతలు, ఆముక్కూ నాపోలికే అని అనుకున్నాను. నాలక్షణాలు వాడిలో కనిపించాయి అని తలచాను.

ఇంక ఆవూళ్ళోవుంటే అనుమానాలెక్కువవుతాయి. కొంతడబ్బు యజమానికియిచ్చి, వాడ్ని సరిగా పోషించమని చెప్పి వెళ్లిపోయాను.

వాడికి చదువు చెప్పిద్దామని ప్రయత్నించా. లాభంలేదు. వాడు వొట్టి మూర్ఖుడు. అడవిమనిషి. త్రాగుబోతు. ఏమాత్రం డబ్బున్నా కల్లు అంగడికి పోతాడు. హోటలు యజమానికి లంచమిచ్చి వాడి కష్టం తగ్గించాను. బాగా చూడమన్నా. చివరికి యజమాని నాపనులకు ఆశ్చర్యపడి, అనుమానించాడేమో కూడా. 'మీరేంచేసినా ఫలందక్కదండి. వృధాప్రయాస. మీరు అతన్ని పాడుచేస్తారుకాని బాగుచేయలేరు. మీకు బీదలకి సాయంచేద్దామనే వుంటే కావలసినంతమంది అనాథులున్నారు. మీ కష్టానికి ఫలందక్కించే ఓకుర్రాణ్ణి ఏరుకొండి' అన్నాడు.

అతనికేం జవాబుచెప్పను? నాసందేహాలుకాని, నా అనుమానాలుకాని కొంచెం తెలిస్తే నా అవమానానికి మితి వుండదు. నన్ను నాశనంచేయడానికి ఏమాత్రం సందేహించడు.

'నళినిని చంపినవాణ్ణి నేనే. నళినికొడుకు నీచజీవితానికి కూడా నేనే కారకుణ్ణి' అని ఎప్పుడూ అనుకుంటూ వుంటా. వాడి జన్మకి నేనే కారకుణ్ణి అని, నాకూ వాడికీ రక్తసంబంధము వుందనీ, నిజంగా నాపేరు వాడికి రావలసిందనీ అనుకున్నప్పుడల్లా, నా అంతరాత్మ బాధపడడమే కాకుండా, నాహృదయంలో ఏదో వెచ్చగా విచారకరంగా వుంటుంది. వాణ్ణి చూసినప్పుడల్లా, ఏదో ఆశ్చర్యకరమైన, చెప్పలేని సహింపలేని భావం కలుగుతుంది. అది నువ్వు తలచుకోనైనా లేవు సుమీ!

వాణ్ణి చూడాలన్న దాహానికి తృప్తి లేదు. కాని అతన్నిచూస్తే, భరింపలేని బాధకలుగుతుంది. ఆ కిటికీలోంచి ఆ కుంటివాణ్ణి చూస్తూ, 'అడుగో నాకొడుకు' అనుకుంటూవుంటా. అప్పుడే వొకసారి వాణ్ణి కౌగలించుకోవాలని తోస్తుంది. కాని ఎప్పుడూ ఆకుంటివాడి చేతులైనా ముట్టుకోలేదు.

ఆరేళ్ళనుంచి ప్రతిఏడూ ఈతలపు మాత్రం నన్ను విడిచిపెట్టలేదు. ఏదో బరువు పెట్టినట్టు వుంటుంది నాహృదయంలో. ఒకవిధమైన ఉదుటు నన్ను ప్రతిఏడూ ఆవూరు తీసుకెడుతోంది. ప్రతివత్సరం, ఆకుంటివాడు కాళ్ళీడ్చుకుంటూ ఆపేడలోనూ, ఆవులశాలలోనూ తిరుగుతుంటే చూసి వాడికీ నాకూ, పోలికవుందని నిర్ధారణకువస్తూ, వాడికి సాయంచేద్దామని నిశ్చయిస్తూ నాపాపానికి ప్రతీకారం చేయడానికి ప్రయత్నిస్తున్నాను. కాని ప్రతిఏడూ, ఏనిశ్చయానికీ రాలేక బాధపడుతూ, తపిస్తూ, అనుమానిస్తూ, భయపడుతూ తిరిగి వస్తున్నాను.